
సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



లారీని ఢీకొట్టిన బస్సు IIలో

పెనుగొల్లు సమీపంలో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో 9 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది.



విశాఖపై టాటా ముద్ర IIలో

దిగ్గజ పారిశ్రామిక వేత్త.. గొప్ప మానవతావాది రతన్ టాటాకు విశాఖతో మంచి అనుబంధం ఉంది. తన దాతృత్వంతో చెరగని ముద్ర వేశారు.



రన్ ఫర్ అంబేడ్కర్

విశాఖ సిటీ: వచ్చే నెల 26న ఆర్‌కే బీచ్‌లో నిర్వహించనున్న రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఏయూ వీసీ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఘనంగా సాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాక కల్కి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుదర్శన పెరుమాళ్ వారిని పల్లకిలో అధిష్టింప చేసి ఆలయంలో, మాడ వీధుల్లో గ్రామ తిరువీధి సేవతో బలిహరణలు పూర్తి చేశారు. తరువాత గోదాదేవి అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ సహస్రనామ అష్టోత్తర శతనామ కుంకుమార్చనలు జరిగాయి. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్కి వేంకటేశ్వస్వామి వారి ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనంపై అధిష్టింపజేసి రథోత్సవం నిర్వహించాల్సి ఉంది. అయితే వర్షం కారణంగా తిరువీధి సేవకు వీలు పడలేదు. దాంతో అర్చకులు ఆలయంలోనే పూజలు నిర్వహించారు.

హోంగార్డు కుటుంబానికి సహచరుల ఆర్థిక సాయం



హోంగార్డు భార్య కనకమహాలక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: అనకాపల్లి ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు పొట్నూరి రవికుమార్ కుటుంబాన్ని సహచరులు ఆర్థికంగా ఆదుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.4,10,695లను చెక్కు రూపంలో మృతుడి భార్య కనకమహాలక్ష్మికి ఎస్పీ ఎం.దీపిక గురువారం అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులు విధి నిర్వహణలో మరణించినా, పదవి విరమణ చేసినా.. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఒకరోజు వేతనాన్ని సహచర హోంగార్డులు అందించడం అభినందనీయమన్నారు.

'హనీట్రాప్ కేసు'లో ముగిసిన జెమీమా కస్టడీ

తగరపువలస: హనీట్రాప్ కేసుకు సంబంధించి మురళీనగర్ ఎన్జీవోస్ కాలనీకి చెందిన నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీమా ఒక్కరోజు కస్టడీ ముగిసింది. భీమిలి పోలీస్ స్టేషన్‌లో గురువారం భీమిలి సీఐ బి.సుధాకర్, కంచరపాలెం, దువ్వాడ సీఐలు చంద్రశేఖర్, మల్లేశ్వరరావు ఆమెను విచారించి కీలక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. జెమీమా నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్, ఫోన్లను ఓపెన్ చేయించి.. అందులో హనీట్రాప్ ముఠాకు సంబంధించిన మూలాలు, మిగిలిన బాధితులకు సంబంధించిన సమాచారం సేకరించినట్టు సమాచారం. బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నందున వీటిని బయటపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి రావడంతో పాటు హనీట్రాప్‌లో కీలక వ్యక్తులు చిక్కుకున్నట్టు తెలిసింది. గురువారం న్యాయస్థానం ద్వారా జెమీమాను తిరిగి సెంట్రల్ జైలుకు తరలించారు. కంచరపాలెం, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా వారు మళ్లీ నిందితురాలిని కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది.

• చంద్రబాబు మార్కు మహా మోసం

అన్నదాతకు వెన్నుపోటు

ఖరీఫ్ సీజన్ దాదాపు చివరి దశకు చేరింది. వరి పొట్ట దశలో ఉంది. దసరా తరువాత కోతలు మొదలు కానున్నాయి. అయినా అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫునా ఎటువంటి భరోసా లభించలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.2 వేలు చొప్పున రెండు విడతల్లో పెట్టుబడి కింద ఆర్థిక సాయం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందు ఇస్తానన్న పెట్టుబడి సాయం కోసం జిల్లాలో 2,50,888 మంది రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ 'రైతు భరోసా' స్థానంలో 'అన్నదాతా.. సుఖీభవ' పేరిట ఏడాదికి రూ.20 వేలు సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఆశ చూపిన సీఎం చంద్రబాబు.. గద్దెనెక్కాక అన్నదాతను నిండా ముంచేశారు.

- ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా అందని పెట్టుబడి సాయం
- 'సుఖీభవ' పేరుతో రూ.20 వేలు అందిస్తామని బాబు హామీ
- పీఎం కిసాన్ నిధులు రెండు విడతలు విడుదలైనా.. రాష్ట్ర సాయం గురించి నోరు పెదపని 'కూటమి' పెద్దలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభంలోనే 'భరోసా'

పీఎం కిసాన్ నిధుల జమ ఇలా..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం జూన్ 18న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద తొలి విడతలో రూ.2 వేల చొప్పున రూ.37.72 కోట్లు విడుదల చేసింది. జిల్లాలో 1,88,614 మంది రైతులు లబ్ధి పొందారు. ఈ నెల 6న రెండో విడత కిసాన్ సాయం కింద 1.90 లక్షల మంది రైతులకు రూ.38.07 కోట్లు విడుదల చేశారు. రెండు విడతల్లో కలిపి రూ.75.79 కోట్లు ఆర్థిక సాయం అందించారు.



సాక్షి, అనకాపల్లి: సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అన్నదాతను నిలువునా ముంచేసింది. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా సాయంపై ఎటువంటి ప్రకటన లేదు. రూ.20 వేలు పెట్టుబడి సాయం అందితే కొంత వరకు అప్పుల బాధ తప్పుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గడచిన ఐదేళ్లూ తొలకరి సీజన్‌కు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా ఒకేసారి అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా మూడు దఫాలుగా రూ.13,500 అందించారు. ఇందులో తొలి విడతగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మే నెలలోనే కేంద్రం రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 రైతులకు అందజేసేవి. దీంతో జిల్లాలో 2,50,888 మంది చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్ పెట్టుబడి కింద ఏటా దాదాపు రూ.338 కోట్లు ఆర్థిక సాయం అందేది. ఈ ఏడాది ఎటువంటి సాయం అందకపోవడంతో ఖరీఫ్ సాగుకు రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

అన్నదాతకు బాబు బకాయి : 501.77 కోట్లు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టిన మరుక్షణమే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు భరోసా సాయం కింద ఒక్కో రైతుకు రూ.20 వేలు అందించాల్సి ఉంది. ఇలా జిల్లాలో అర్హులైన 2,50,888 మంది రైతులకు సుమారు రూ.501.77 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. కానీ నాలుగు నెలలు కావస్తున్నా రైతు భరోసాపై ఎటువంటి ప్రకటన చేయలేదు. విధి విధానాలు రూపొందించలేదు. చంద్రబాబు ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకుని అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నాం..



నాకు రెండెకరాల పొలం ఉంది. ప్రభుత్వం సాయం అందిస్తుందనే నమ్మకంతో పెట్టుబడి నిమిత్తం అప్పు చేశాను. ఖరీఫ్ సీజన్ సగం అయింది. రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుభరోసా సాయం కోసం చూస్తున్నాను. గత ఐదేళ్లలో నాలుగేళ్ల పాటు రైతు భరోసా అందింది. పెట్టుబడి సాయంగా ఉండేది. ఈ ఏడాది పెట్టుబడి సాయం లేదు. రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపాలి.

– సామిరెడ్డి నరసింహమూర్తి, బుచ్చింపేట గ్రామం, రోలుగుంట మండలం

ఈ ఏడాది రైతుకు అన్నీ కష్టాలే..



గత ఐదేళ్ల మాదిరి రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తే రైతును ఆదుకున్నట్లు అవుతుంది. లేదంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది తొలుత నుంచి రైతుకు కష్టాలే. తొలుత వర్షాలు లేవు. వరినాట్లు వేసిన 20 రోజుల్లో భారీ వర్షాలతో పంట నీట మునిగి నష్టపోయాం. అయినా పంట నష్ట పరిహారం లేదు. పెట్టుబడి సాయం లేదు. వరి నాట్లు వేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకూ చాలా ఖర్చులు పెట్టాల్సి వస్తోంది. రైతు భరోసా కింద రూ.20 వేలు సాయం అందితే కొంత ఊరట కలుగుతుంది.

– అన్నంరెడ్డి కొండబాబు, రైతు, బుచ్చింపేట గ్రామం, రోలుగుంట మండలం

రైతన్నను ఆదుకోవాలి..



ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు భరోసా కింద రైతుకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కనికరించకపోతే ఎలా..? రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులకు ఆర్థిక సహాయం విడుదల చేయాలి. కానీ నాలుగు నెలలు కావస్తున్నా సాయం లేదు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో అందించిన కిసాన్ రూ.4 వేల సాయం ఎరువులు కొనుక్కోవడానికి వచ్చాయి. పెట్టుబడికి రైతులు చేసిన అప్పులు అలానే ఉన్నాయి. వాటి వడ్డీలు పెరుగుపోతున్నాయి. త్వరితగతిన ఆర్థిక సహాయం అందించాలి.

– పీలా బుజ్జి, తుమ్మపాల గ్రామం, రైతు సంఘం అధ్యక్షుడు

విజయవాడకు కొత్త విమాన సర్వీసులు



గోపాలపట్నం (విశాఖ): విశాఖ నుంచి విజయవాడకు, విజయవాడ నుంచి విశాఖకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానయాన సంస్థ ఈ నెల 27 నుంచి రెండు కొత్త సర్వీస్‌లను ప్రారంభించనుంది. అలాగే 29న విజయవాడ నుంచి విశాఖకు ఇదే సంస్థ మరో సర్వీస్ ప్రారంభించనుంది. ఇందులో ఓ సర్వీస్ వారం రోజులూ అందుబాటులో ఉంటుంది. ఇది విజయవాడ నుంచి విశాఖకు ఉదయం 10.35 గంటలకు వచ్చి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరుతుంది. మరో సర్వీస్ విజయవాడ నుంచి రాత్రి 8.55 గంటలకు విశాఖ చేరుకుని.. రాత్రి ఒంటి గంటకు తిరిగి విజయవాడ బయలుదేరుతుంది. ఇది సోమ, బుధ, శుక్ర, ఆది వారాల్లో అందుబాటులో ఉంటుంది. ఇదే విమానం 29వ తేదీ నుంచి రాత్రి 9 గంటలకు విశాఖ చేరుకుని తిరిగి రాత్రి ఒంటి గంటకు విజయవాడ బయలుదేరుతుంది. మంగళ, గురు, శని వారాల్లో ఈ సర్వీస్ అందుబాటులో ఉంటుందని విమానయాన సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

15న కేంద్ర సహాయ మంత్రి రాక

మహారాణిపేట (విశాఖ): కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ఈనెల 15న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఆ రోజు ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించిన అనంతరం సాయంత్రం 6.55 గంటలకు విమానంలో గన్నవరం వెళతారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డీగా శాంతిప్రభ



ఎం.శాంతి ప్రభ

మహారాణిపేట (విశాఖ): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ అధికారి(ఆర్‌డీ)గా డాక్టర్ ఎం.శాంతిప్రభ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌డీగా ఉన్న డాక్టర్ రాధారాణి 45 రోజుల పాటు సెలవు పెట్టారు. దీంతో జోనల్ మలేరియా అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.శాంతి ప్రభను ఇన్‌చార్జి ఆర్‌డీగా నియమించారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- విజయవాడకు 4 ప్యాకేజీలతో 40 బస్సులు
- హైదరాబాద్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మరో 20
- అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి నుంచి మూడు రోజులపాటు స్పెషల్ బస్సులు

నర్సీపట్నం నుంచి విజయవాడకు ప్రత్యేక ప్యాకేజీ చార్జీలు

సర్వీసు	పల్లె వెలుగు	అల్ట్రా పల్లె వెలుగు	ఎక్స్‌ప్రెస్	అల్ట్రా డీలక్స్
హైవే మీదుగా	రూ.800	రూ.900	రూ.1000	రూ.1250
వయా ద్వారపూడి	రూ. 860	రూ.970	రూ.1070	రూ.1350
వయా ద్వారకా తిరుమల	రూ.910	రూ. 1030	రూ.1140	రూ.1420
వయా గొల్లలమామిడాడ	రూ.970	రూ.1090	రూ.1210	రూ.1510
వయా భద్రాచలం	రూ.1190	రూ.1340	రూ.1490	రూ.1860



సాక్షి, అనకాపల్లి: దసరా పండగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రజారవాణా శాఖ (ఏపీఎస్‌ఆర్టీసీ) ప్రత్యేక సర్వీసులను నడపనుంది. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో ఇందుకోసం 60 స్పెషల్ బస్సులను సిద్ధం చేశారు. వీటిని 11, 12, 13 తేదీల్లో నడపనున్నారు. ఈ స్పెషల్ బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేస్తామని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. అనకాపల్లి నుంచి విజయవాడకు వెళ్లే రోజువారీ సర్వీసులను యథాతథంగా కొనసాగిస్తూ స్పెషల్ సర్వీసులు వేస్తున్నారు.

భవానీ భక్తులకు 4 ప్యాకేజీల్లో సర్వీసులు

విజయవాడలో కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు వెళ్లే భవానీ భక్తుల కోసం ఆర్టీసీ 4 ప్యాకేజీలతో అదనంగా ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ సర్వీసులతోపాటు ఈ ప్రత్యేక సర్వీసులు అదనంగా నడపనుంది. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి 40 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఇవి కాక అనకాపల్లి డిపో నుంచి విశాఖపట్నం, పాయకరావు పేట, విజయనగరం, పలాస, రాజమండ్రి, విజయవాడకు పది, నర్సీపట్నం డిపో నుంచి హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నంలకు మరో పది ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే..



అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి ఈనెల 11, 12, 13 తేదీల్లో 40 ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇవి కాక ఆ రెండు డిపోల నుంచి హైదరాబాద్‌కు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మరో 20 బస్సులు నడుపుతాం. అవసరమైతే 14వ తేదీన కూడా స్పెషల్ సర్వీసులను పొడిగిస్తాం. ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నాం.

– పద్మావతి, జిల్లా ప్రజారవాణా శాఖ (ఆర్టీసీ) అధికారి

సింహగిరిపై శంఖుచక్రనామాలు

- పదేళ్ల అనంతరం నవ్య కాంతులతో దర్శనం
- రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన జీఆర్‌టీ జ్యుయలర్స్



కనువిందు చేస్తున్న నూతన శంఖుచక్రనామాలు

సింహాచలం: సింహగిరిపై మైక్రోటవర్‌కి వెళ్లే దారిలో కొండపై నూతనంగా ఏర్పాటు చేసిన శంఖుచక్రనామాలు గురువారం నుంచి కనువిందు చేస్తున్నాయి. నగరంలోని జీఆర్‌టీ జ్యుయలర్స్ డెబ్బై లక్షల రూపాయలతో వీటిని ఏర్పాటు చేసింది. 36 అడుగుల ఎత్తు, వంద అడుగుల వెడల్పు మేర ఏర్పాటు చేసిన నూతన శంఖు చక్రనామాలు సింహాచలంతో పలు ప్రాంతాల వారికి కూడా కనిపించే విధంగా ఏర్పాటు చేశారు. బలమైన గాలులు, హుద్‌హుద్ వంటి తుఫాన్‌లను సైతం తట్టుకుని ఉండేలా రూపొందించారు. సరిగ్గా పదేళ్ల అనంతరం మళ్లీ సింహగిరిపై నూతన శంఖుచక్రనామాలు దర్శనమిస్తున్నాయి. 2014లో ఏర్పడ్డ హుద్‌హుద్ తుఫాన్ కారణంగా సింహగిరిపై టీవీ టవర్ వద్ద ఉండే శంఖుచక్రనామాలు నేలకొరిగాయి. మళ్లీ వాటిని ఏర్పాటుచేసేందుకు దేవస్థానం ఆసక్తి చూపలేదు. గత ట్రస్ట్‌బోర్డులో సభ్యులు పదే పదే దేవస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో దేవస్థానం దాతల సహకారంతో నూతన శంఖుచక్రనామాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక చేసింది. జీఆర్‌టీ జ్యుయలర్స్ ముందుకు రావడంతో వారి సహకారంతో ఇన్నేళ్లకు మళ్లీ శంఖుచక్రనామాల దర్శనం కలిగింది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం

- బాధితులకు నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు
- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, పాల్గొన్న ఎస్పీ దీపిక, జేసీ జాహ్నవి

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో విచారణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె ఎస్పీ ఎం.దీపికతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు ప్రాధాన్యమివ్వాలని, పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు నష్టపరిహారం, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ కమిటీ సభ్యులు తెలియజేసిన విషయాలపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పెండింగ్ కేసుల వివరాలను జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. గత సమావేశంలో చర్చించిన సమస్యలపై తీసుకున్న చర్యలను కేసులవారీగా తెలియజేశారు. 85 కేసులు, 293 పిటి కేసులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో 16 మంది బాధితులకు చెల్లించవలసిన పరిహారం రూ.21 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు కొరత తీవ్రంగా ఉందని, ఎలక్ట్రిక్ షాక్ మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రహరీలు, మరుగుదొడ్లు లేకపోవడం మూలంగా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇతర సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో బి.దయానిధి, ఆర్డీవోలు వి.వి రమణ, షేక్ ఆయిషా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణమూర్తి, డీఐపీఆర్వో కె.ఇంద్రావతి, కమిటీ సభ్యులు కె.అప్పారావు, జి.మరియమ్మ, కె.వెంకటరమణ, బి.అప్పారావు పాల్గొన్నారు.

జిల్లాలో పది వేల దోమతెరల పంపిణీ

జిల్లాలో ఉచితంగా పది వేల దోమతెరలను పంపిణీ చేశామని, అందిన వారు సక్రమంగా వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి దోమతెరల పంపిణీపై ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వివిధ కంపెనీలు అందజేసిన దోమతెరలను 2,390 పీవీటీజీ గ్రామాలకు, 4,287 గిరిజన గ్రామాలకు, 1,168 ఇతర గ్రామాలకు, 1,443 వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు.

వసతి గృహాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్క విద్యార్థి దోమతెరలను వినియోగించుకొనేలా వార్డెన్లు పర్యవేక్షించాలన్నారు. గ్రామాలలో నిల్వనీటి కుంటలలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశ్రామికవేత్తల సహకారంతో త్వరలో మరిన్ని దోమతెరలు పంపిణీ చేయడానికి చర్యలు చేపడతామన్నారు. గిరిజన సంక్షేమాధికారి నాగలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు వేచలం విద్యార్థినులు

- రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన బాలికలు



ఎంపికైన విద్యార్థినులతో పీడీ తమ్మునాయుడు

దేవరాపల్లి: మండలంలోని వేచలం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4 నుంచి 6 వరకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో వీరు విశేష ప్రతిభ కనబరిచారు. అండర్–16 బాలికల విభాగం పెంటథ్లాన్(60 మీటర్ల రన్నింగ్, 80 మీటర్ల హార్డిల్స్, 600 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్)లో 9వ తరగతి విద్యార్థిని బి.చైతన్య ద్వితీయ స్థానంలో నిలిచింది. మరో విద్యార్థిని ఆర్.భారతి పాల్గొన్న అండర్–20 విభాగంలో 200 మీటర్లు, 400 మీటర్ల రన్నింగ్, 100 మీటర్ల రిలేలో ప్రథమ స్థానం సాధించారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన వీరంతా నాగార్జున యూనివర్సిటీలో త్వరలో జరిగే 35వ సౌత్ జోన్ నేషనల్ మీట్‌లో పాల్గొంటారని పీడీ ఆర్.తమ్మునాయుడు తెలిపారు. ఈయనతోపాటు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం డి. నర్సింహమూర్తి, సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, స్కూల్ కమిటీ చైర్మన్ నాగేష్ అభినందించారు.

విశాఖపై టాటా ముద్ర

- 2018లో ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశానికి రతన్ టాటా హాజరు
- దివంగత సీఎం వైఎస్సార్ విజ్ఞప్తి మేరకు అగనంపూడిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు
- గత సీఎం జగన్ చొరవతో టీసీఎస్ కంపెనీ ఏర్పాటుకు సుముఖత



ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రసంగిస్తున్న రతన్ టాటా (ఫైల్)

విశాఖ సిటీ: దిగ్గజ పారిశ్రామిక వేత్త.. దార్శనికుడు.. గొప్ప మానవతావాది.. అభినవ కర్ణుడు.. అజాతశత్రువు.. రతన్ నవల్ టాటాకు విశాఖతో కూడా అనుబంధం ఉంది. ఆయన నగరానికి కేవలం ఒక్కసారే వచ్చినప్పటికీ.. ఇక్కడి అందాలకు మంత్రముగ్ధులయ్యారు. ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పలు రంగాల్లో పరిశోధనలకు ఆలోచనలు చేశారు. దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రధానంగా క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేందుకు అగనంపూడిలో హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. దేశ పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపిన ధీశాలి రతన్ టాటా.. అనారోగ్యంతో ముంబై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. దీంతో విశాఖలో ఆయన చేసిన పర్యటన.. విశాఖ అందాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అప్పటి ఆయన రాకను గుర్తు చేసుకుంటూ ఆయన మాటలను అనేక మంది బాధాతప్త హృదయాలతో నెమరువేసుకుంటున్నారు.

విశాఖపై ముద్ర

రతన్ టాటా ఒకే ఒకసారి విశాఖకు వచ్చారు. నగరంలో కొన్ని గంటల పాటు పర్యటించి ఇక్కడి అందాలకు ఫిదా అయిపోయారు. 2018, డిసెంబర్ 10వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రతన్ టాటా తొలిసారిగా విశాఖలో అడుగుపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలో పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఏయూలో జరిగిన కార్యక్రమానికి హాజరై విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపారు. రతన్ టాటా వస్తున్నట్లు తెలుసుకున్న ఏయూ పూర్వ విద్యార్థులు ఎప్పుడూ లేని విధంగా ఈ కార్యక్రమానికి పోటెత్తారు. 6 వేల మంది పూర్వ విద్యార్థులతో పాటు అప్పటి ఏయూ విద్యార్థులు కూడా వేల సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటలకు విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఏయూ ప్రాశస్త్యం, ఔన్నత్యం పూర్తిగా తెలియనప్పటికీ.. ఇక్కడకు వచ్చాక యూనివర్సిటీ ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నారు. 'ఆంధ్రా యూనివర్సిటీతో కలిసి ఏం చేయాలో అన్వేషించాలనుకుంటున్నాను. డేటా అనలిటిక్స్, హ్యూమన్ జెనోమిక్ సీక్వెన్సింగ్, ప్రెడిక్టివ్ బిజినెస్ రంగాల్లో టాటా గ్రూప్, ఏయూ మధ్య అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తాను విశాఖలో కొద్ది గంటలే పర్యటించినప్పటికీ.. నగరం ఆకట్టుకుందని కితాబిచ్చారు. ఈ మాటలకు ఆ సభ హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

నాడు తండ్రి.. నేడు కొడుకు విజ్ఞప్తుల మేరకు..

ముంబై కేంద్రంగా ఉన్న తన వ్యాపార సామ్రాజ్యాన్ని ప్రపంచంలో అనేక దేశాల్లో విస్తరించిన రతన్ టాటా విశాఖలో మాత్రం క్యాన్సర్ రోగుల కోసం ఆస్పత్రిని నెలకొల్పారు. 2004–09 మధ్య అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విశాఖలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని రతన్ టాటాను విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం అగనంపూడిలో స్థలాన్ని కూడా కేటాయించారు. దీంతో వైఎస్సార్ మరణం తరువాత కూడా హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ఇప్పుడు వేలాది మంది క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తోంది. అలాగే 2019–24 మధ్య గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ప్రతిష్టాత్మకమైన టీసీఎస్ సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కూడా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. ఆ చొరవ కారణంగానే ప్రస్తుతం విశాఖలో టీసీఎస్‌లు అడుగులు పడబోతున్నాయి. తాజాగా ప్రభుత్వం మారినప్పటికీ.. విశాఖలో టీసీఎస్ సంస్థ ఏర్పాటు విషయంపై ప్రస్తుత రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా బుధవారమే ప్రకటించారు. అదే రోజు సాయంత్రం రతన్ టాటా కన్నుమూశారు. రతన్ టాటాకు విశాఖతో దీర్ఘకాల అనుబంధం లేకపోయినప్పటికీ.. ఇక్కడ ఐటీ సేవలు విస్తరించడానికి అడుగులు పడుతున్న సమయంలో మరణించడం బాధాకరం.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్



ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని జేసీ ఎం.జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలతో కలిసి ఆమె ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహాల్లో చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. రోడ్ల పక్కన జీవీఎంసీ సిబ్బంది ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేసి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే– ఫ్రైడే పాటించడం వల్ల దోమల వృద్ధిని నివారించవచ్చన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి వారం ఒక ప్రాంతంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మార్కెట్ యార్డులో రూ.15 లక్షలతో రెండు ఓపెన్ జిమ్స్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. శారదానది ఒడ్డున అన్నమయ్య పార్కు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల లోడుతో లారీ బోల్తా



శొంఠ్యాం శివారు జాతీయరహదారిపై బోల్తా పడిన ఉల్లిబస్తాల లారీ

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం శివారు ఎస్‌జీఆర్ పురం జాతీయరహదారిపై గురువారం వేకువజామున ఉల్లిపాయల లోడులో లారీ బోల్తా పడింది. బెంగళూరు నుంచి కోల్‌కతాకు వెళ్తున్న ఈ లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌పైకి 50 మీటర్ల వరకు దూసుకుపోయి రోడ్డుపై అడ్డంగా పడిపోయింది.

ఈ ప్రమాదంలో లారీ సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రెయిలింగ్ మాత్రం కూలిపోయింది. సంఘటన స్థలానికి ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు చేరుకుని రెండు క్రేన్ల సాయంతో రహదారి మీద నుంచి లారీని తొలగించారు. మరో వాహనంలోకి ఉల్లిపాయలను లోడ్ చేసి పంపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఫోర్జరీ కేసులో బీజేపీ నేత అరెస్ట్

భీమునిపట్నం: డాక్యుమెంట్ ఫోర్జరీ కేసులో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు కోడూరి సంజీవరావు, ఆయన తండ్రి కోడూరి రామారావును గురువారం భీమిలి పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. జీవీఎంసీ 4వ వార్డు రామయోగి అగ్రహారంలో 2021 సంవత్సరంలో స్థల వివాదానికి సంబంధించి డాక్యుమెంట్లు ఫోర్జరీ చేశారని కేసు నమోదైంది.

కాపర్ సామగ్రి చోరీలో 12 మంది అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని పలు కంపెనీల్లో 880 కిలోల కాపర్ సామగ్రి అపహరణ కేసులో 12 మందిని అరెస్ట్ చేసినట్లు క్రైం విభాగం ఏసీపీ వెంకటరావు వెల్లడించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్రంపాలెం పారిశ్రామిక ప్రాంతంలోని పలు కంపెనీల్లో దాదాపు రూ.12 లక్షల విలువ చేసే 880 కిలోల కాపర్ సామగ్రిని నిల్వ చేశారు. ఈ నెల 4న ఆయా ప్రాంతంలో చెత్త ఏరుకునే 12 మంది వ్యక్తులు ఆయా ప్రాంతంలో సంచరించారు. ఆయా సామగ్రిని వారు దొంగలించినట్టు తమ విచారణలో తేలడంతో వారిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ వెల్లడించారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు







విశాఖ స్పోర్ట్స్: శివాజీ పార్కు రింక్‌లో విశాఖ స్కేటర్లు రయ్‌మంటూ దూసుకుపోయారు. రాష్ట్ర జట్టు ఎంపికలో భాగంగా ఇక్కడ ఆర్టిస్టిక్, స్పీడ్, రింక్ రేస్‌లు ఉత్కంఠగా సాగుతున్నాయి. గురువారం జరిగిన ఆర్టిస్టిక్ పోటీల్లో సోలోతో పాటు పెయిర్ అంశాల్లో స్కేటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వుడా పార్క్‌లోని బాంక్‌డ్ రింక్‌లో స్పీడ్‌తో పాటు రేస్ పోటీలు హోరాహోరీగా సాగాయి.

16న 'నర్సుల సంఘం' నామినేషన్ల స్వీకరణ

మహారాణిపేట: ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16న నామినేషన్లు స్వీకరిస్తారని సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.ఎస్.నిర్మల కుమారి తెలిపారు. నాలుగేళ్ల విరామం తర్వాత కార్యవర్గ ఎన్నికలు జరుగుతున్నట్లు చెప్పారు. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ, 23న పోలింగ్ ఉంటుందన్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారని, 24న రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందన్నారు. ఆ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక జరుగుతుందని వివరించారు.

పాత నేరస్థుడి అరెస్టు



నిందితుడితో ఆర్పీఎఫ్ పోలీసులు

తాటిచెట్లపాలెం: ఓ కేసులో తప్పించుకుతిరుగుతున్న నిందితుడ్ని ఎట్టకేలు ఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మర్రిపాలెం రైల్వే భద్రతా దళం, మర్రిపాలెం పోస్టులో 2022లో జరిగిన నేరంతో సంబంధం ఉన్న కంచరపాలేనికి చెందిన అగ్రహారపు గౌరీ కాంత్ అప్పటి నుంచి తప్పించుకుతిరుగుతున్నాడు. గురువారం అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్ఐ మమతానాయక్, హెడ్ కానిస్టేబుళ్లు టి.సురేష్‌కుమార్, బడే మహేష్‌లు నిందితుడ్ని మర్రిపాలెం రైల్వే పోస్ట్ పరిధిలో అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు.

లారీని ఢీకొట్టిన సూపర్ లగ్జరీ బస్సు

- 9 మంది ప్రయాణికులకు గాయాలు
- పెనుగొల్లు జాతీయ రహదారిపై ఘటన



నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ఆర్టీసీ డ్రైవర్‌ని బయటకు తీస్తున్న స్థానికులు



పెనుగొల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు



నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు

ఎస్.రాయవరం: మండలంలోని పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో 9 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. కాకినాడ నుంచి విశాఖపట్నానికి నాన్ స్టాప్ సూపర్ లగ్జరీ బస్సు వెళ్తోంది. అదే సమయంలో అడ్డురోడ్డు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వచ్చిన బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. సీటులో ఉన్న డ్రైవర్ కాళ్లు రాకపోవడంతో కాసేపు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు గమనించి అతికష్టం మీద అతడిని బయటకు లాగారు. ప్రమాదానికి గురైనప్పుడు డ్రైవర్‌తో కలిపి 37 మంది ప్రయాణికులు బస్సులో ఉండగా, వారిలో విజయనగరానికి చెందిన ఎం.చాణిక్య, ఒడిశాకు చెందిన కె.చంద్రసబత్, రంజన్‌పంగీ, కాకినాడకు చెందిన పి.మంగ, రత్నకుమారి, వి.వరప్రసాద్, విశాఖపట్నానికి చెందిన ఉమామహేశ్వరి, నూకరత్నం గాయపడ్డారు. వీరంతా పెనుగొల్లు, నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రాథమిక వైద్య సేవలు పొంది వారి సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. బస్సు వేగంతో ఉన్నప్పటికీ డ్రైవర్ అప్రమత్తంగా కావడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం తర్వాత ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్ఐ విభీషణరావు రంగంలోకి దిగి క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

వాహనాలపై ఎంవీ ఇన్‌స్పెక్టర్ దాడులు

- సరైన ధ్రువపత్రాలు లేని 9 వాహనాలపై కేసులు

రోలుగుంట: నర్సీపట్నం -వడ్డాది ఆర్‌అండ్‌బీ మార్గంలో నర్సీపట్నం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకట్రావు తన సిబ్బందితో కలసి గురువారం వాహనాలపై దాడులు చేశారు. ఇక్కడ తనిఖీ సమయంలో రవాణా అనుమతి ధ్రువపత్రాలు లేని తొమ్మిది వాహనాలపై కేసులు నమోదు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒక ట్రాక్టరు, రెండు ఆటోలు, ఆరు ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాహనాలు నడిపే సమయంలో విధిగా రవాణా అనుమతి ధ్రువపత్రాలు ఉండాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వీటితోపాటు వాహనదారుకు హెల్మెట్, ఆటో డ్రైవర్ విధిగా యూనిఫాం ధరించాలన్నారు. విధిగా నిబంధనలు పాటించి ప్రమాద బీమా అర్హత పొందాలని సూచించారు.

850 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి కట్టుపాలెం చెరకు కాటా కార్యాలయం వద్ద పాడుబడిన రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ చేసిన 850 కేజీల పీడీఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్సై కే సావిత్రి గురువారం తెలిపారు. పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారులు చేపట్టిన సంయుక్త తనిఖీల్లో పట్టుబడిన ఈ బియ్యాన్ని లైనుకొత్తూరులో పౌర సరఫరాల శాఖ గోదాముకు తరలించామన్నారు. ఇందుకు బాధ్యుడిగా మాకవరపాలెంకు చెందిన పచ్చిగోళ్ల వెంకట సూర్యనారాయణపై కేసు నమోదు చేశామన్నారు. ఇటీవల యలమంచిలి పట్టణం, మండలంలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్టు, స్థానికంగా కొన్ని రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ పెరిగిపోయినట్టు విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీనిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టి తనిఖీలు పెంచి ఈ దందాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

2 గ్రావెల్ ట్రాక్టర్లు, పొక్లెయిన్ పట్టివేత



పట్టుకున్న గ్రావెల్ ట్రాక్టర్లు



ఇసుక లోడుతో పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

కోటవురట్ల: విశ్వసనీయ సమాచారం మేరకు గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పోలీసులు దాడి చేశారు. 2 ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను పట్టుకున్నారు. అన్నవరం శివారున కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నట్టు గురువారం సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బంది దాడి చేయగా సంఘటనా స్థలంలో గ్రావెల్ లోడింగ్ చేస్తుండగా రెండు ట్రాక్టర్లను, పొక్లెయిన్‌ను పట్టుకున్నారు. వీటిని మైనింగ్ శాఖాధికారులకు అప్పగించినట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు...

నర్సీపట్నం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను టౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. నాతవరం మండలం తాండవ నదిలోని ఇసుకను టిప్పర్లతో నర్సీపట్నం తీసుకొచ్చి విక్రయిస్తుండగా పట్టుకుని టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై టౌన్ ఎస్సై రమేష్‌ను సంప్రదించగా మొదటి తప్పుగా రూ.10 వేలు అపరాధ రుసుం విధించి వాటిని విడిచి పెట్టామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన సీఐలు విజయకుమార్, వెంకటనారాయణ

అనకాపల్లి: ఏటా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పారిశుధ్య కార్మికులను ఆదుకోవడం అభినందనీయమని పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి. విజయకుమార్, వెంకటనారాయణ తెలిపారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద 80, 81 వార్డుల పారిశుధ్య కార్మికులకు బుధవారం రాత్రి వ్యాపారవేత్తలు విల్లూరి నానాజీ, కర్రి వెంకట రమణ బాబు ఆర్థిక సాయంతో బట్టలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కాస్త తగ్గింది. గత వారంతో పోల్చుకుంటే కిలోకి రూ.పది తగ్గింది. గత వారం కిలో రూ.80 ఉండగా, ఈ వారం రూ.70కి విక్రయాలు సాగాయి. బంగాళదుంప రూ.40, ఉల్లి, క్యాబేజి రూ.50, బీట్‌రూట్, క్యారెట్, వంకాయ, దొండకాయ, బీరకాయ రూ.60, బెండకాయ, క్యాప్సికం రూ.80, పాదు చిక్కుడు రూ.వంద, ఆగాకర రూ.120 చొప్పున విక్రయాలు సాగాయి.

ఈవోపీఆర్డీగా వెంకటలక్ష్మి బాధ్యతలు



వెంకటలక్ష్మిని అభినందిస్తున్న మండల పరిషత్, సచివాలయ సిబ్బంది

కశింకోట: మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మునగపాక నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎం. సోమరాజు మునగపాక బదిలీ అయ్యారు. వెంకటలక్ష్మి గతంలో కశింకోట, తాళ్లపాలెం మేజర్ పంచాయతీలకు కార్యదర్శిగా పని చేశారు. ఇప్పుడు పదోన్నతిపై ఇక్కడకు ఈవోపీఆర్డీగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 269బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	5,370
రెండో రకం	3,600	4,040
మూడోరకం	3,200	3,470

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
శ్వాగ్	: సత్యనారాయణ స్క్రీన్-2
వేట్టయన్	: పర్తిసాయి
వేట్టయన్	: షిర్డిసాయి
జిగ్రా	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
మార్టిన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-34 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 434 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 387 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

పడకేసిన పారిశుధ్యం

- పేరుకుపోయిన చెత్తాచెదారాలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పట్టించుకోని అధికారులు
- అనకాపల్లి పట్టణ వాసుల ఇక్కట్లు



జోనల్ కార్యాయం వద్ద డంపింగ్ యార్డులో చెత్త



నాగులాపల్లి కాలువలో చెత్త



నర్సింగరావుపేట జీవీ కోటేశ్వరరావు వీధిలో రహదారిపై చెత్త



బారువారు వీధిలో చెత్తలో పందులు

అనకాపల్లి: పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చెత్త అక్కడే అన్న చందంగా పట్టణ పరిసరాలు అధ్వానంగా మారాయి. రోడ్లతోపాటు ఖాళీ ప్రదేశాల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయాయి. పూడిక తీయకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పర్యవసానంగా ఈగలు, దోమలతో పట్టణ వాసులు సహవాసం చేయాల్సి దుస్థితి నెలకొంది. జోనల్ కార్యాలయ అధికారులకు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కంపోస్టుయార్డుగా మారిన జోనల్ కార్యాలయం

పట్టణ పరిధిలో సేకరించిన చెత్తా చెదారాలను స్థానిక ఉడ్‌పేట, వేల్పుల వీధి, జీవీఎంసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో పారబోస్తున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డు గోడకు ఆనుకుని జీవీఎంసీ పెద్ద హైస్కూల్, మెయిన్‌రోడ్డు గోడను ఆనుకుని నెహ్రూచౌక్ ఆర్టీసీ కాంప్లెక్స్, తపాలా కార్యాలయం, యూనియన్ బ్యాంక్, ఆర్డీవో కార్యాలయం, పంచాయతీ రాజ్ కార్యాలయంతోపాటు స్థానికులు దుర్గంధం భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల సమయంలో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, జోనల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ...

పట్టణ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను అధ్వానంగా తయారైంది. పట్టణం మీదుగా బయటకు పోయేందుకు సరైన మార్గం లేకపోవడంతో డ్రైనేజీల్లో మురుగు నిల్వ ఉండిపోయి, దోమలు సంచారం ఎక్కువగా ఉంటోంది. పైగా డ్రైనేజీలు ద్వారా విష సర్పాలు రావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం న్యూకాలనీలో నాగుజెర్రి ద్విచక్ర వాహనంలోకి దూరి బుసలు కొట్టడంతో అక్కడ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో వర్షాల సమయంలో నీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టీడీపీ నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా? అధికారంలోకి రాగానే మరోలా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

చెత్తను తొలగించాలి...

పట్టణ పరిధిలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా బ్లీచింగ్ పౌండర్ చల్లాలి. డ్రైనేజీ పూడిక తీత పనులు చేపట్టి, త్వరితగతిన అక్కడ నుంచి తక్షణమే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు తరలించాలి



పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీలో చెత్తా చెదారం ఎప్పటికప్పుడు తొలగించాలి. ప్రజలను దోమల బారి నుంచి రక్షించాలి. ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి. పట్టణ నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డు తరలించాలి.

– పి.కల్యాణ్‌చక్రవర్తి, అనకాపల్లి

పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

పట్టణ పరిధిలో నిత్యం ఉదయం, సాయంత్రం సమయంలో రహదారులపై చెత్తను తొలగిస్తున్నాం. ఆ తర్వాత ఆదేరోజు సాయంత్రం డ్రైనేజీలో పూడికతీత పనులు పారిశుధ్య కార్మికులు చేపడుతున్నారు. చెత్తను నిత్యం లారీల ద్వారా విశాఖ కాపులుప్పాడకు తరలిస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకువచ్చినట్లయితే తక్షణమే పరిష్కరిస్తాం.

– అయ్యప్పనాయుడు, జెడ్సీ, అనకాపల్లి

రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి

తుమ్మపాల: దేశానికి అత్యున్నత సేవలందించిన రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక సభ్యుడు బుద్ధ రాజేష్ కోరారు. పట్టణంలోని ఉత్తరాంధ్ర చర్చ వేదిక కార్యాలయంలో గురువారం ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా 8 లక్షల మంది కార్మికులకు, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి దేశ అభివృద్ధిలో తన ప్రత్యేకత చాటుకున్నారన్నారు. టీ నుంచి ట్యాక్సీ వరకు పరికరాలను తయారు చేయడంలో తనదైన శైలిని నిరూపించుకున్నారని, ప్రపంచ దేశాలు కరోనా మహమ్మారితో అల్లాడుతుంటే దేశ ప్రజల కోసం వందల కోట్లు ఖర్చు చేసి ఆదుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సభ్యులు లంకెలపల్లి సూర్యనారాయణ, బుద్ధ రాధ, బుద్ధ శ్రీను, ద్రాక్షారపు పరదేశి నాయుడు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి గురునాథరావు జయంతి

కశింకోట: దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురునాథరావు విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధరరాజు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తదితరులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు, గుడివాడ అభిమానులు తదితరులు హాజరు కావాలని కోరారు.

కశింకోట పంచాయతీ కార్యదర్శిగా రామచంద్రరావు

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యదర్శిగా ఎస్. రామచంద్రరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సబ్బవరం మండలం ఆరిపాక నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రమేష్ సబ్బవరం మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావుకు పంచాయతీ, సచివాలయ సిబ్బంది దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



కశింకోటలోని పెద్ద బజారులో దుర్గాదేవికి అంబలం పూజలు



దాడి వారి వీధిలో దుర్గాదేవికి భవానీ భక్తులు నిర్వహిస్తున్న అంబలం పూజ

కశింకోట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి నామస్మరణతో గ్రామాలు మార్మోగుతున్నాయి. కశింకోటలో పదికి పైగా, తాళ్లపాలెంలో ఐదు చోట్ల దుర్గాదేవి విగ్రహాలను నెలకొల్పి ఉత్సవాలు నిర్వహిస్తుండగా, మిగిలిన గ్రామాల్లో ఒక్కొక్కటి వంతున దుర్గాదేవి విగ్రహాలు ఏర్పాటు చేసి ఎనిమిది రోజులుగా నిత్య పూజలు చేస్తున్నారు. దీనిలో భాగంగా అంబలం పూజలు, భారీ అన్న సమారాధనలు, సారె, ఘటాల ఊరేగింపులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజనలు వగైరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక భావం వెల్లివిరుస్తోంది. శనివారం విజయ దశమి కావడంతో ఉత్సవాలను మరింత ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. భవానీ భక్తులు, సాధారణ భక్తులు భక్తి పారవశ్యంతో పాల్గొంటున్నారు.

సబ్సిడీపై ఉల్లి, టమాటా విక్రయాలు



సబ్సిడీపై ఉల్లి, టమాటా సబ్సిడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి: పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో గౌరీ హోల్‌సేల్ కూరగాయల సంఘం ఆధ్వర్యంలో సబ్సిడీపై ఉల్లి, టమాటా విక్రయాలను గురువారం ఆయన ప్రారంభించారు. కేజీ ఉల్లి రూ.50, టమాటా రూ.50 చొప్పున విక్రయిస్తున్నామన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి రూ.70, టమాటా రూ.100 ఉందన్నారు. వీటి ధరలు తగ్గే వరకూ రోజూ అమ్మకాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, సంఘం కార్యదర్శి కాండ్రేగుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల మండల అధ్యక్షుడిగా బాషా



నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు బాషా

అనకాపల్లి: మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడిగా ఎస్‌కేఆర్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక శారదానది ఒడ్డున శాంతిపార్కులో గురువారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా జి.అప్పలనరసమ్మ సూర్యారావు, కార్యదర్శిగా బోడే అర్జునరావు, కోశాధికారిగా ఎన్. అభిరామ్ ఎన్నికయ్యారు. పై కమిటీ ఎన్నిక మూడు సంవత్సరాల పాటు ఉంటుందని పూర్వ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఏలు జి.సోమయ్య, ఆర్ అప్పారావు, ఇ. నూకేశ్వరరావు, టి.ప్రసాద్, జి.రాధిక, కె.మోది, అన్సర్ బీబీ, వెంకటలక్ష్మి, ఎం. శ్రీలక్ష్మి, పి.జ్యోతి, ఎన్. శివఅప్పారావు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు



అగ్రహారం వీధిలో రోడ్డుపైనే పారుతున్న మురుగు

కశింకోట: స్థానిక అగ్రహారం వీధిలో రక్షిత నీటి పథకం వద్ద రోడ్డుపైనే మురుగు ఏరులా పారుతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వాడుక నీరు, వర్షం నీరు రోడ్డుపైనే పారుతోందని, కాలువలు నిర్మించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు

నాతవరం : మండలంలో మర్రిపాలెంలో కేజీబీవీలో బోధనేతర సిబ్బంది నియమకాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు గురువారం తెలిపారు. నైట్ వాచ్‌మన్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళలు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు వయో పరిమితి సడలింపు ఉందన్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు నేడు ఆఖరు

అనకాపల్లి: పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం షాపుల ఏర్పాటుకు శుక్రవారం రాత్రి 7 గంటల లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ స్టేషన సీఐ లక్ష్మణ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి సత్యలక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 14న ఉదయం 8 గంటలకు మద్యం షాపు దరఖాస్తుదారుల డ్రా వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగములనేలే.. జగదాంబ

- దుర్గాదేవి అలంకరణలో అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో విశేష పూజలు
- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



మహిషాసురమర్దని అవతారంలో కన్యకా పరమేశ్వరిదేవి



మహిషాసురమర్దని అవతారంలో గౌరీదేవి



కామాక్షిదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి



కశింకోట శివాలయంలో దుర్గాదేవిగా సర్వమంగళాంబ



కశింకోటలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



సతకంపట్టు ఆలయం వద్ద ముత్తయిదువులకు వాయనం అందజేస్తున్న భాగ్యలక్ష్మి, మోహినీదేవి



విజయరామరాజుపేటలో అర్ధనారీశ్వరుడు



కామాక్షిదేవికి సారె ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో 'సువాసిని పూజ చేస్తున్న మహిళలు



కోట్నివీధిలో అన్నసమారాధన



తాళ్లపాలెం కూడలిలో దుర్గాదేవిని దర్శించుకున్న భరత్‌కుమార్‌కు సత్కారం

అనకాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అష్టమి సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో పెద్ద ఎత్తున కుంకుమార్చనలు, హోమాలు చేశారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారి ఆలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేపట్టారు.

నూకాంబిక అమ్మవారి బాలాలయంలో...

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతి, కుంకుమ పూజలు నిర్వహించారు. నూకాంబిక అమ్మవారిని కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చిత్రపటాన్ని టీడీపీ నాయకుడు దాడి జయవీర్ కలెక్టర్‌కు బహూకరించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుర్గదేవిగా సతకంపట్టు కనకదుర్గమ్మ...

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు చేపట్టారు. వ్యాపారవేత్తలు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి, మళ్ల జగ్గప్పారావు మోహిని దేవి దంపతులు ఆర్థిక సాయంతో ఏడు వేల మంది ముత్తయిదువులకు వాయనాలు అందజేశారు.

గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీదేవి మహిషాసురమర్ధదేవిగా దర్శనమిచారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి 7 గంటలకు అమ్మవారికి 'బలిహరణ' కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిషాసురమర్ధిని అవతారంలో..

స్థానిక నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్ధనిగా దర్శనమిచ్చారు. మహిళలు వివిధ రకాల పిండి వంటకాలను తయారు చేసి సాయంత్రం 5 గంటలకు సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్ధనిగా దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక సువాసిని పూజ చేశారు. గురునాట్య కళారత్న భాగవతుల శిరీషారాణి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతిష్ట శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో..

సత్యనారాయణపురంలో కనకదుర్గ కొండపైన అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



దుర్గాదేవి అవతారంలో సతకంపట్టు కనకదుర్గమ్మ

కనకదుర్గమ్మ సేవలో భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో దసరా ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక నర్సింగరావుపేట దుర్గాలమ్మ వీధి, విజయరామరాజుపేట, వేల్పులవీధి చాకలిపేట, కోట్ని వీధి, కొత్తూరు జంక్షన్‌ల్లో కనకదుర్గమ్మ మండపాలు, దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు ఆయా ప్రాంతాల కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు

కశింకోట: తాళ్లపాలెం కూడలిలో దుర్గాదేవిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకున్నారు. అన్నసమారాధన ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, నాయకులు లగిశెట్టి గణేష్, చిన్ని జనార్దన్, ఇందలి మునిలినాయుడు, చిన్ని రాజీవ్‌పాల్గొన్నారు.

కశింకోట హైవే ఆనుకుని కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్. ప్రసాద్‌బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. స్థానిక శివాలయంలో సర్వమంగళాంబను దుర్గాదేవిగా అలంకరించి సహస్ర నామార్చనతో కుంకుమ పూజలు చేశారు. బయ్యవరంలో హైవే పక్కన ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. జెట్టపురెడ్డితునిలో భారీ అన్న సమారాధనలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మజ్జి సూర్యప్రకాష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి నిరంజన్‌కుమార్, పాల సంఘం అధ్యక్షుడు కోన నాగవెంకటసురేష్ పాల్గొన్నారు.



దుర్గాదేవి అవతారంలో కనకదుర్గమ్మ



వేల్పులవీధి రజకుల కాలనీలో శాకంబరి దేవిని దర్శించుకున్న భరత్‌కుమార్, జానకీరామరాజు